సాక్షి
చిత్తూరు
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



ఉరకలెత్తిన ఉత్సాహం

కిక్కిరిసిన జనసమూహాన్ని చీల్చుకుంటూ దూసుకెళ్లే కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు సాహసించారు. - 8లో



'ఉభయ' భాగస్వామ్యం

కాణిపాకంలోని ఆలయ అభివృద్ధి పనుల్లో ఉభయదారులకు కీలక భాగస్వామ్యం కావాలని వారు కోరారు. - 8లో



హైందవం.. విశ్వవ్యాప్తం

హైందవ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు మఠాధిపతులందరూ కృషి చేయాలని స్వామీజీలు దిశానిర్దేశం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

కాణిపాకం కిటకిట



భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు తరలి రావడంతో స్వామివారి కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100, ఉచిత దర్శన క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనం కల్పించారు. క్యూలలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



సమావేశమైన పెద్దిరెడ్డి, చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ ఆలయంలో ఈనెల 28 నుంచి మూడురోజులపాటు జరిగే లక్ష కుంకుమార్చన పూజలు భక్తి పారవశ్యాన్ని చాటేలా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం లో ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఆలయ ఈఓ చంద్రమౌళి పాలక మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ లక్ష కుంకుమార్చనను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడురోజుల కార్యక్రమ ఏర్పాట్లు, ఉభయదారులకు కల్పించాల్సిన సేవలు, సౌకర్యాలపై చర్చించారు. కుంకుమార్చన కార్యక్రమంలో రూ.1500 చెల్లించి పూజల్లో పాల్గొనవచ్చని వివరించారు. ఉభయదారులుగా వ్యవహరించే దంపతులకు ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా అమ్మవారి ఆలయ ముఖ చిత్రం అమ్మవారి ప్రతిమతో ముద్రించిన శాలువలను తయారు చేసినట్లు చెప్పారు. మొదటి శాలువను ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పెద్దిరెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ, పాలకమండలి సభ్యులు కలిసి సత్కరించారు. అనంతరం త్వరలో బోయకొండ ఆలయం వద్ద జరగబోయే వేలం పాటలపై చర్చించారు. ఆయన వెంట పాలక మండలి సభ్యుడు రాజేష్, భాస్కర్‌రెడ్డి, నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, సురేష్, చెన్నరాయుడు తదితరులున్నారు.

23 నుంచి టెన్త్ ప్రీ పబ్లిక్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 23వ తేదీ నుంచి పదవ తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం డీఈఓ విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 23న తెలుగు, 24న హిందీ, 26న ఇంగ్లీష్, 27న గణితం, 28న ఫిజిక్స్, 29న బయాలజీ, మార్చి 1న సోషియల్ పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు నిర్వహించాలని డీఈఓ ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 69,232 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,536 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.22 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

భజన మండళ్లను పటిష్ట పరచండి

శ్రీకాళహస్తి: భజనమండళ్లను పటిష్టపరచాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెలికం కృష్ణా రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లోని కొన్ని శ్రీరామాలయాలు శిథిలావస్థలో, మరి కొన్ని దీపారాధనలు లేక, భజనలు లేక నిరర్థకంగా ఉన్నాయన్నారు. ఆధ్యాత్మిక భావనలు భక్తుల్లో నింపేందుకు గ్రామస్థాయి నుంచి భజనమండళ్లను పటిష్టపరచడం ఒకటే మార్గమని తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో సహాయకులను ఏర్పాటు చేసి శ్రీరామాలయాల్లో భజనమండళ్లను ఏర్పాటు చేయించి అవసరమైన పరికరాలను సమకూర్చాలని కోరారు.

నాడు : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 1998లో డీఎస్సీ అభ్యర్థులు చాలామంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పరీక్షలు రాసిన వేలాది మందికి అన్యాయం చేసింది. పోస్టింగ్‌లు ఇవ్వకుండా సంవత్సరాలపాటు వేధించింది. న్యాయం చేయాలని చంద్రబాబు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. దీంతో విధిలేక అభ్యర్థులు కోర్టు మెట్లెక్కారు. న్యాయం చేయాలని కోర్టులు ఆదేశించినా టీడీపీ సర్కారు వారికి అన్యాయమే చేసింది.

నేడు : చంద్రబాబునాయుడి హయాంలో నష్టపోయిన 1998 డీఎస్సీ బాధితులు ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. డీఎస్సీలో అర్హత సాధించినా.. తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వేదనను విన్న జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. వారి పాతికేళ్ల కలను నెరవేర్చారు. వారందరూ ప్రస్తుతం ఉద్యోగాలు పొంది సంతోషంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు జగనన్న రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని సగర్వంగా చెబుతున్నారు.



ఉద్యోగాలిచ్చిన సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

మాదేవుడు జగన్

మాటంటే మాటే. ఇచ్చిన మాట కోసం.. ప్రజలకు ఇచ్చిన హామీ కోసం కట్టుబడేవాళ్లు ఈ కాలంలో చాలా కొద్దిమందే ఉంటారు. అలాంటి కోవకు చెందిన వారే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి. నాడు ప్రజాసంకల్ప యాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చారు. పాతికేళ్లుగా ముప్పుతిప్పలు పెట్టిన చంద్రబాబు వేధింపులకు చరమగీతం పాడారు. ఎట్టకేలకు 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చి భరోసా కల్పించారు. జగనన్న సహకారం వల్లే తమకు ఉద్యోగాలొచ్చాయని ఉప్పొంగిపోతున్నారు.

1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు

- పాతికేళ్ల పాటు వేధించిన చంద్రబాబు
- అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 533 మందికి పోస్టింగ్‌లు
- 2008 డీఎస్సీ అభ్యర్థులు 187 మందికీ ఉద్యోగాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇచ్చిన మాట తప్పడం చంద్రబాబునాయుడి నైజమైతే.. ఇచ్చిన మాటకు కట్టుబడి న్యాయం చేయడం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంతం. 1998 డీఎస్సీ పరీక్షలు రాసి, ఉత్తీర్ణత సాధించి.. 24 సంవత్సరాలుగా ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. నాటి ప్రభుత్వాలు వారి వేదన ఆలకించలేదు.



నియామకపత్రం అందుకుంటున్న 1998 డీఎస్సీ అభ్యర్థి

ప్రస్తుతం వారందరికీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) విధానంలో ఉద్యోగాలు కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 533 మంది 1998 డీఎస్సీ అభ్యర్థులు టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

13 ఏళ్ల నిరీక్షణకు తెర

2008 డీఎస్సీలో అర్హత పొంది పలు కారణాలతో కొంత మంది ఉద్యోగాలు పొందలేకపోయారు. క్వాలిఫైడ్ అభ్యర్థులు ఎన్నోసార్లు ధర్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నికలకు ముందు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 468 మందికి ఒప్పంద ప్రాతిపదికన మినిమమ్ టైం స్కేల్‌తో ఉద్యోగాలు ఇచ్చారు. వారందరూ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

బాబే మోసం చేశారు



అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబే 1998 డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం చేశారు. న్యాయం కోసం గతంలో ఎన్నో ధర్నాలు చేశాం. అప్పటి రాజకీయ నాయకులకు ఎన్నో విన్నపాలు అందజేశాం. కానీ వారెవ్వరూ మా సమస్యను పట్టించుకోలేదు. ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌ను కలిసి విన్నవించాం. న్యాయం చేస్తానని నాడు మాట ఇచ్చారు. మమ్మల్ని టీచర్‌గా చేసి కలను సాకారం చేశారు.

– సోమశేఖర్, 1998 డీఎస్సీ టీచర్, చిత్తూరు జిల్లా

ఎన్ని సార్లు తిరిగామో



నోటిఫికేషన్ రాగానే ఎంతో కష్టపడి ఉద్యోగం కోసం పరీక్షలు రాశాను. అర్హత పొంది ఉద్యోగం వస్తుందని సంతోష పడ్డాను. అయితే చంద్రబాబు మమ్మల్ని నిలువునా ముంచేశాడు. అయినా 24 ఏళ్ల పాటు న్యాయం కోసం పోరాటం చేశాం. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మాకు ఉద్యోగం ఇచ్చారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– రెడ్డిశేఖర్, 1998 డీఎస్సీ టీచర్, చిత్తూరు జిల్లా

న్యాయం చేశారు



కామన్ మెరిట్ లిస్టు కారణంగా గతంలో మాకు అన్యాయం జరిగింది. ఆ తర్వాత పాలకుల వద్దకు వెళ్లి న్యాయం చేయాలని తిరిగాం. వారు పట్టించుకోలేదు. జగన్ సర్‌కు మా బాధ చెప్పుకున్నాం. అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తుపెట్టుకుని మరీ మాకు న్యాయం చేశారు. ప్రస్తుతం ఉద్యోగం చేసుకుంటున్నాను. సీఎం వైఎస్ జగన్ మాత్రమే మా కుటుంబానికి భద్రత కల్పించారు.

– అరుణావతి, 2008 టీచర్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా

అనర్హులన్నారు



1998లో డీఎస్సీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాను. అయినప్పటికీ అనర్హులుగా ప్రకటించారు. నాలాగా చాలామంది ఆ డీఎస్సీలో నష్టపోయారు. టీచర్ కొలువు కోసం ఎన్నో కలలు కన్నాను. టీడీపీ పాలనలో తీరని అన్యాయం జరిగింది. జగన్ సీఎం కావడం వల్లే మాకు న్యాయం జరిగింది. నియామక పత్రం చేతికి వచ్చింది. వైఎస్ జగన్ రుణం ఈ సారి ఎన్నికల్లో తీర్చుకుంటాం.

– సదాశివ, 1998 డీఎస్సీ టీచర్, తిరుపతి జిల్లా

13 సంవత్సరాలు నిరీక్షించాం



న్యాయం కోసం టీడీపీ పాలకుల వద్దకు ఎన్నో సార్లు తిరిగాం. కానీ న్యాయం మాత్రం జరగలేదు. మా సమస్యలను కనీసం వినేవారు కూడా కాదు. 13 సంవత్సరాల పాటు నిరీక్షించాను. ఇక మాకు ఈ టీచర్ ఉద్యోగం రాదని అనుకున్నాం. చివరి సారిగా ప్రజా సంకల్పయాత్రలో మా జగన్‌కు సమస్యను చెప్పుకున్నాం. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

– గుణశేఖర్, 2008 డీఎస్సీ టీచర్, చిత్తూరు జిల్లా

ఎన్ని సార్లు వినతిపత్రాలు ఇచ్చామో!



మాకు న్యాయం చేయాలని టీడీపీ పాలనలో చంద్రబాబు సహా మంత్రులందరికీ ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చామో, ధర్నాలు చేశామో. అయినా అప్పట్లో వారు ఏ మాత్రం మా మొర ఆలకించ లేదు. చివరికి ఉద్యోగం రాదని ఆశలు వదులుకున్నాను. చదివిన చదువుకు న్యాయం జరగలేదని బాధపడేవాడిని. 2021లో మాకు సర్కారు పాఠశాలలో కొలువులిచ్చి సీఎం జగన్ న్యాయం చేశారు. ఇచ్చిన మాటను నెరవేర్చారు.

– అనిల్, కేవీబీపురం, 2008 డీఎస్సీ టీచర్, తిరుపతి జిల్లా

'స్మృతి' పథంలో మహానేత

- వైఎస్సార్ హయాంలోనే సెజ్‌లకు శ్రీకారం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నాయుడుపేటటౌన్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా పలు సెజ్‌లకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మేనకూరులో వైఎస్సార్ స్మృతి వనంతో పాటు, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ వేలాది ఎకరాలను సేకరించి పారిశ్రామిక వాడలను నెలకొల్పిన ఘనత మహానేత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. మేనకూరులో ఏర్పాటు చేసిన సెజ్ ద్వారా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని వెల్లడించారు. నిరుపయోగంగా ఉన్న భూములను రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి రైతులను రారాజులను చేశారని కొనియాడారు. తండ్రి అడుగుజాడల్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం పారిశ్రామిక ప్రగతికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. మేనకూరు వద్ద కట్టా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.కోట్ల వ్యయంతో వైఎస్సార్ స్మృతి వనం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఒక్క మేనకూరు పంచాయతీలోనే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.32 కోట్లు అందించినట్లు తెలిపారు. మరో రూ.8కోట్లతో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పోరాడి విజయం సాధించాలని సూచించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న నిర్దేశించినట్లు మొత్తం 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు, ఎల్లోమీడియా అసత్య ప్రచారం చేస్తూ సంక్షేమ పాలనపై విషం కక్కుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేయాలని స్పష్టం చేశారు. నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, జెడ్పీటీసీ సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, నాయకులు కట్టా వెంకట రమణారెడ్డి, కట్టా కమలాకర్ రెడ్డి, షేక్ రఫీ, చిందేపల్లి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తాం

- మహిళా రక్షణ, శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తాం
- చిత్తూరు నూతన ఎస్పీ జాషువా

చిత్తూరు అర్బన్: చిత్తూరు నూతన ఎస్పీగా పి.జాషువా ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఈయన్ను చిత్తూరుకు బదిలీ చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో, ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. పోలీసు అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎస్పీ జాషువా మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతమైన జీవనం గడపడానికి జిల్లా పోలీసుశాఖ నిర్విరామంగా పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం తమ ముందు రానున్న ఎన్నికలనే లక్ష్యం ఉందన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి ఎన్నికల నియమ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూస్తానన్నారు. ఇందుకోసం జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో మహిళలపై జరిగే నేరాలను అరికట్టడానికి ఓ టాస్క్ రూపొందించుకుని ముందుకు వెళతామన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు జిల్లా సరిహద్దు కావడంతో బోర్డర్ క్రైమ్ నివారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అసాంఘిక శక్తులను ఉపేక్షించేదిలేదని, ప్రజలంతా పోలీసుశాఖకు సహకరించాలన్నారు. ఇక పోలీసు సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని స్పష్టం చేశారు. గతంలో పలమనేరులో డీఎస్పీగా పనిచేసిన అనుభవం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూతన ఎస్పీని పలువురు పోలీసు అధికారులు, యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎస్పీని మర్యాద పూర్వకంగా కలుస్తున్న పోలీసు అధికారులు

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

తిరుపతి తుడా: క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు తెలిపారు. ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ దేశంలో ఏటా సుమారు 15 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అందులో 7 నుంచి 8 లక్షల మంది మరణిస్తున్నట్లు వెల్లడించారు. క్యాన్సర్ చికిత్స ఖరీదైందని, అందుకే ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. మహమ్మారిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించవచ్చని సూచించారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ క్రమంలోనే జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగానే చేయించనున్నట్లు వివరించారు. కలెక్టర్ లక్ష్మీ శ మాట్లాడుతూ స్విమ్స్ సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం రెండు ప్రత్యేక బస్సులు సిద్ధం చేశామన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి ప్రాజెక్టును ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి చికిత్సకు ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్నాయన్నారు. అనంతరం వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందనకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ పి.జాషువా ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా స్పందనలో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కాపునేత



వైఎస్సార్‌సీపీలో చేరిన అప్పోజీకి కండువా వేసి ఆహ్వానించిన విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ కాపునేత, కాణిపాకం ఆలయ మాజీ ట్రస్టు బోర్డు సభ్యుడు అప్పోజీ వైఎస్సార్ సీపీలోకి చేరారు. కాపులంతా వైఎస్సార్‌సీపీలో ఉంటామన్నారు. నగరంలోని సంతపేటలో ఏర్పాటు చేసిన సభలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి 50 కుటుంబాలకు చెందిన వారిని పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. విజన్ ఉన్న నాయకుడు అప్పోజీ అని, సంతపేట డివిజన్‌పై తనకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానికంగా మహిళ సమాఖ్య భవనం అవసరమని సమాఖ్య నాయకురాలు కామాక్షి కోరారు. తక్షణం అప్పోజి రూ.50 వేలు, వివేకానంద రవి తరపున రూ.20 వేలు, కామాక్షి రూ.25 వేలును విజయానందరెడ్డి చేతుల మీదుగా సమాఖ్య సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం తరుపున సమాఖ్య భవన నిర్మాణం చేయిస్తామని ఆయన హామీనిచ్చారు. పార్టీలో చేరినవారిలో బాబు, ఢిల్లీకుమార్, నాగరాజు, భాస్కర్, కుమరేష్, లోకేష్, బ్యాంకు మురళీ, బ్యాంకు సురేష్, వెంకటరత్నం, మది, మారి, అలగన్, పయణి, సీఎస్ రెడ్డి, ఆనంద్ ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, పార్లమెంట్ అధ్యక్షుడు పుల్లికల్లు రవీంద్రనాథరెడ్డి, లీగల్ నాయకులు కన్న, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు నారాయణ, శీన, దివాకర్, నేతాజీ, చిన్నయ్యనాయుడు, ద్వారక, అగస్తీశ్వర ఆలయ చైర్మన్ శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైందవం.. విశ్వవ్యాప్తం



సదస్సులో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుమల : హైందవ ధర్మ పరిరక్షణతోపాటు సనాతన సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు దేశంలోని పీఠాధిపతులు, మఠాధిపతులు సమష్టిగా కృషి చేయాలని స్వామీజీలు దిశానిర్దేశం చేశారు.
ఆదివారం తిరుమల శ్రీవారి ఆస్థాన మండపంలో నిర్వహించిన ధార్మిక సదస్సు ఆధ్మాతిక పరిమళాలు వెదజల్లింది. రెండో రోజు సదస్సులో 17 మంది స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. గోమాతను విశ్వమాతగా ప్రకటించాలని పిలుపునిచ్చారు. అనంతరం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ప్రసంగిస్తూ మఠాధిపతుల సూచనలు తప్పకుండా పాటిస్తామని చెప్పారు.

'ఉభయ' భాగస్వామ్యం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో ఉభయదారులకు కీలక భాగస్వామ్యం కల్పించాలని ఆలయ ఉభయదారుల కమిటీ తెలిపారు. ఆలయ ఉభయదారులు ఈశ్వర్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వామివారి చరిత్ర పుస్తకావిష్కరణలో, ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో ఉభయదారులకు కీలక భాగస్వామ్యం కల్పించాలన్నారు. ప్రతి నెలా సంకటహర చతుర్థి వ్రతం రోజు నిర్వహించే స్వామివారి బంగారు రథం ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆ రోజు కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు తలపించేలా తగు ఏర్పాట్లు చేయాలని వారు నిర్ణయించారు. పై కార్యక్రమాలు ఉభయదారులకు ఆలయ అధికారులు తెలియజేయాలని, అలా తెలపకపోతే నిరసనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, వైఎస్ సర్పంచ్ విశ్వనాథ్ రెడ్డి, ఉభయదారులు చిన్నారెడ్డి, రవిచంద్రా రెడ్డి, సుధీర్, నవీన్ మనోహర్ నాయుడు, పుణ్యసముద్రం రవి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో సత్ఫలితాలు వచ్చాయి. ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఎంతోమంది వృద్ధులకు ఉచితంగా కంటి చికిత్స, ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు పంపిణీ చేశారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ దాక్టర్లు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం అందిస్తుండడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన జగన్ సర్కారు
- ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ అమలు
- రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిధి పెంపు
- నాడు–నేడు ద్వారా పీహెచ్‌సీల ఆధునీకరణ, సదుపాయాల కల్పన
- విలేజ్ క్లినిక్‌ల ద్వారా పల్లెల్లోనే కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు
- సత్ఫలితాలు ఇచ్చిన ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పుంగనూరు: సింగిరిగుంటలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్





పుంగనూరు: ఆరడిగుంటలో వృద్ధుడికి ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తున్న వైద్యురాలు(ఫైల్)

పేదల ఆరోగ్యానికి సర్కారు భరోసా



పుంగనూరు మండలంలోని ఏతూరులో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్



పుంగనూరు: చంద్రమాకులపల్లెలో వృద్ధురాలికి ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

పుంగనూరు: గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయాత్మక మార్పులు తీసుకొచ్చింది. మంచానికే పరిమితమై ఇబ్బంది పడుతున్న రోగుల ఇళ్ల వద్దకే ప్రభుత్వ వైద్యులు వెళ్లి వైద్యం అందిస్తుండడం పట్ల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఏళ్ల తరబడి పాడుబడిన పీహెచ్‌సీ భవనాల్లో అరకొర వైద్యసేవలు అందించేవారు. పీహెచ్‌సీల్లో సరైన సదుపాయాలు కూడా ఉండేవి కాదు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు పేద ప్రజల పాలిట వరంలా మారాయి. పీహెచ్‌సీలను ఆధునీకరించడంతో పాటు కొత్త భవనాలు నిర్మించారు. విలేజ్ క్లినిక్‌లను సైతం ఏర్పాటు చేసి తద్వారా చిన్నపాటి రోగాలకు సుదూర ప్రాంతం వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే ప్రజలకు వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించారు. అలాగే 104 వాహన సేవలు, విలేజ్‌క్లినిక్‌లు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నియోజకవర్గం పుంగనూరు పరిధిలో గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందుతున్నాయి.

ఇంటి వద్దనే వైద్యసేవలు

గ్రామీణ ప్రాంతాల్లో 104 వాహనాల ద్వారా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల వద్ద రోగులకు వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా 104 వాహనంలో డాక్టర్లు, సిబ్బంది కలసి ప్రతి ప్రాంతంలో రెండు లేదా మూడుసార్లు పర్యటిస్తారు. ఆ ప్రాంతంలో ఉన్న రోగులను గుర్తించడం, గర్భిణులకు, బాలింతలకు ఎప్పటికప్పుడు వైద్యసేవలు, మందులు అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు, వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు కింద చికిత్స అందించి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నారు.

కంటిచూపు ప్రసాదించారు..



నాకు కంటి చూపును వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రసాదించింది. కంటి జబ్బుతో ఇబ్బందులు పడుతున్న నాకు 104 సిబ్బంది గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక స్థోమత లేని నాకు ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించి, కంటి చూపు ప్రసాదించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం రుణపడి ఉంటాం.

– జి.సూరి, వనమలదిన్నె

పట్టణాలకు వెళ్లే బాధ తప్పింది



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినప్పటి నుంచి వైద్యసేవల కోసం పట్టణాలకు వెళ్లే తిప్పలు తప్పాయి. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హెల్త్ కేంద్రం సిబ్బందికి సమాచారం అందిస్తే మా ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. మా గ్రామీణ ప్రజల కోసం ఇంతమంచిగా వైద్యసేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటాం.

– రమణారెడ్డి, కొండామర్రి, చౌడేపల్లె

ఊపిరిపోశారు..



గతంలో ఏదైనా రోగం వస్తే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవాళ్లం. చేతిలో డబ్బులు లేకపోయినా అప్పోసప్పో చేసి అయినా వైద్యం చేయించుకునే పరిస్థితి. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఏఎన్‌ఎంలు ఇంటికొచ్చి వైద్యపరీక్షలు చేస్తూ మందులు ఇస్తున్నారు. పల్లెలకు ఊపిరిపోసిన సీఎం జగనన్నకు అండగా ఉంటాం.

– ఎస్.సఫియా, సోమల మండలం

పుంగనూరు నియోజకవర్గం వివరాలు

మున్సిపాలిటీ : పుంగనూరు
మండలాలు : పుంగనూరు రూరల్, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల
పుంగనూరు:వందపడకల ఏరియా ఆస్పత్రి -1
డాక్టర్లు – 8 మంది
మొత్తం సిబ్బంది – 64 మంది
ప్రతిరోజు 150 మందికి వైద్యసేవలు

పుంగనూరులో విలేజ్ క్లినిక్‌ల సమాచారం

పుంగనూరు ఏరియా ఆస్పత్రి – 1,
పీహెచ్‌సీ-1,
వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్లు – 2
పుంగనూరు రూరల్ : విలేజ్ క్లినిక్‌లు – 21,
చౌడేపల్లె: కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ -1, పీహెచ్‌సీలు- 2, విలేజ్ క్లినిక్‌లు -14
సోమల: కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు -13, పీహెచ్‌సీలు -6, విలేజ్ క్లినిక్‌లు -10
సదుం: కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ -1, పీహెచ్‌సీ-1, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు -11
పులిచెర్ల: పీహెచ్‌సీలు -2, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు- 16
రొంపిచెర్ల:పీహెచ్‌సీ-1, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు- 8

నియోజకవర్గం వివరాలు..

వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు	88
ఖర్చు	రూ.17.60 కోట్లు
సిబ్బంది	306 మంది
డాక్టర్లు	16
చికిత్స పొందిన వారు	37,277 మంది
104 వాహనాలు	8

ఇక్కడే వైద్యసేవలు



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాల వారికి స్థానికంగానే వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో ఏ చిన్నపాటి అస్వస్థతకు లోనైనా మండల కేంద్రంలోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేంది. ప్రస్తుతం ఆ ఇబ్బంది లేకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి అన్ని రకాల వ్యాదులకు చికిత్సలు అందిస్తున్నారు.

– రెడ్డెప్పరెడ్డి, రెడ్డివారిపల్లె, సదుం మండలం

ఉచితంగా ఆపరేషన్ చేశారు



కల్లూరులో నిర్వహించిన వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించి, కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. అనంతరం ఉచితంగా ఆపరేషన్ చేయించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నా కంటి చూపు మెరుగైంది. ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సాబీర్, కల్లూరు

ప్రాణభిక్ష పెట్టారు..



ఆటోతో జీవనం సాగిస్తున్న నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్లుగా కిడ్నీలో రాళ్ల చేరడంతో ఆపరేషన్ చేసుకునే ఆర్థికస్థోమత లేకపోయింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేసుకుని, తిరుపతిలోని స్నేహ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసుకున్నా. సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.36 వేలు అందిం,ఇ. ప్రాణభిక్ష పెట్టారు. అలాగే వాహనమిత్ర ద్వారా ఏడాదికి రూ.10 వేలు అందుతుంది.

– రెడ్డిప్రసాద్, రొంపిచెర్ల క్రాస్

కర్ణాటకకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ షాలిని

చిత్తూరు రూరల్: కాళ్లు విరిగి కదల్లేక కర్ణాటక రాష్ట్రం బెంగళూరు చిక్కసంద్రలోని తన కుమార్తె ఇంట్లో ఉంటున్న ఓ పింఛన్‌దారుడికి ఆదివారం వలంటీర్ నేరుగా అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగ పంచాయతీ వరదరాజులపల్లికి చెందిన రాజేంద్రనాయుడు రెండు నెలల కిందట కాళ్లు విరిగి నడవలేని పరిస్థితి వచ్చింది. బెంగళూరులో నివాసం ఉన్న తన కుమార్తె ఇంట్లోనే ఉంటున్నారు. దీంతో రెండు నెలలు పింఛన్ తీసుకోలేదు. ఈనెల అయినా పింఛన్ డబ్బులు ఇస్తే ఆస్పత్రి ఖర్చులకు ఉపయోగపడుతాయని భావించిన వలంటీర్ షాలిని బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేసింది.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం



సంఘటన స్థలంలో మృతి చెందిన వెంకట్రమణ

బైరెడ్డిపల్లె : ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు బోల్తా పడిన సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం వెలుగుచూసింది. ఎస్‌ఐ మోహన్‌కుమార్ కథనం మేరకు, మండలంలోని పెద్దపురం గ్రామానికి చెందిన బత్తెప్ప కుమారుడు వెంకట్రమణ (37) సొంత ట్రాక్టర్‌తో పొలం పనులు చేస్తూ బాడుగకు వెళ్తుండేవాడు. శనివారం సాయంత్రం కొలమాసనపల్లెలో ట్రాక్టర్ రొటోవేటర్ కొనుగోలు చేశాడు. దీంతో అతని ట్రాక్టర్ పనుల నిమిత్తం వెళ్లడంతో స్నేహితుడి ట్రాక్టర్ తీసుకొని కొలమాసనపల్లెకు వెళ్లి రొటోవేటర్ తగిలించుకొని వస్తుండగా గ్రామ సమీపంలోని చెరువు వద్ద బోల్తా పడింది. రాత్రి సుమారు 11 గంటల సమయం కావడంతో ఎవరూ గుర్తించలేక పోయారు. కుటుంబసభ్యులు వెంకట్రమణ ఇంటికి రాలేదని ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ట్రాక్టర్ బోల్తా పడిన విషయం గ్రామస్తులు గమనించారు. సంఘటనా స్థలానికి వెళ్లి వెంకట్రమణ మృతి చెందిన విషయం కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య గాయిత్రి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గాయత్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గజ బాధితుడికి ఆర్థికసాయం



కార్తీక్‌కు చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: ఏనుగుల దాడిలో గాయపడిన గుడిపాల మండలం, బసవపల్లె గ్రామానికి చెందిన కార్తీక్‌కు ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఆదివారం ఈ మేరకు తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.1.26 లక్షల చెక్కును బాధితుడికి అందజేశారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకుడి హత్య



జగదీష్ (ఫైల్)

నగరి : మున్సిపల్ పరిధి కీళపట్టులో వాటర్‌ప్లాంట్ నిర్వాహకుడు జగదీష్ (30) హత్యకు గురయ్యాడు. సీఐ సురేష్ కథనం మేరకు. జగదీష్ శనివారం రాత్రి ప్లాంట్‌ను మూసి వేసి రాత్రి బైక్‌పై ఇంటి వద్దకు వచ్చాడు. మోటార్ సైకిల్ దిగి స్టాండ్ వేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆకస్మికంగా రాడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన జగదీష్‌ను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఆదివారం ఉదయం మెరుగైన వైద్యసేవల నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మరణించాడు. మృతుడి తల్లి వసుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కాగా మృతుడు జనవరి మొదటి వారంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆ బెదిరింపు కాల్స్ ఆధారంగా విచారణ చేపట్టారు. గ్రామస్తుల కథనం వేరేలా ఉంది. జగదీష్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయమై పలుమార్లు గొడవలు, పంచాయితీలు జరిగినట్లు చెబుతున్నారు. ఆ కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఉరకలెత్తిన ఉత్సాహం



దూసుకుపోతున్న కోడె గిత్తలు

వెదురుకుప్పం : సై అంటే సై అన్నట్లు ఆదివారం మండలంలోని పాతగుంటలో సాగిన జల్లికట్టు యువకుల్లో జోష్ తెచ్చింది. దమ్ముంటే కాసుకో అన్నట్లు సాగిన ఎద్దల పందెంలో కోడిగిత్తలదే పైచేయి అయ్యింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పశువులను పందేనికి తీసుకొచ్చారు. నిర్వాహకులు ఎద్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అప్పటికే అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకున్న యువత పందేనికి సై అన్నట్టు అల్లి వద్ద నిలబడ్డారు. పందేనికి సిద్ధంగా ఉన్న ఎద్లను ఉసిగొల్పారు. కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన సమూహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయింది. ఎద్దులను నిలువరించి పలకలు పట్టేందుకు యువత విశ్వప్రయత్నం చేశారు. కొన్ని ఎద్ల వేగాన్ని నిలువరించి పలకలు పట్టి తమ ప్రతాపాన్ని చూపారు. సింగపూర్‌ఇండ్లలో జల్లికట్టు జోరుగా సాగింది.

పలకల కోసం పోటీలు : పాతగుంటలో జరిగిన జల్లికట్టు సందర్భంగా ఎద్లను కట్టడి చేసే క్రమంలో ఇరువర్గాల వారు పోటీలు పడ్డారు. పలకలు లాక్కొనే సందర్భంలో ఒకరికొకరు తోసుకున్నారు. బహుమతుల కోసం యువకులు అరుపులు కేకలు వేయడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. అంతకు ముందు స్థానిక సర్పంచ్ భువనేశ్వరి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ గోవిందన్, నాయకులు బొజ్జారెడ్డి, మునస్వామి, రమణారెడ్డి, జగదీశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎద్ల పందేలను ప్రారంభించారు.